తెలుగు కంటెంట్ (ఎస్‌జీటీ)

# తెలుగు భాషా రూపాలు.. అంశాలు!

**డీ**ఎస్సీలో ఎస్‌జీటీతో పాటు తెలుగు పండిట్ పరీక్షకు కూడా 'తెలుగు భాషా రూపాలు' అంశం ముఖ్యమైంది. తెలుగు కంటెంట్‌లో ఎక్కువ మార్కులు సాధించాలంటే అభ్యర్థులు తెలుగు అకాడమీ పుస్తకాల్లోని అంశాలను క్షుణ్నంగా చదవాలి.

**'తెలుగు భాషా రూపాలు'లో కనిపించే అంశాలు:**

1. శాసన భాష
2. గ్రాంథిక భాష
3. వ్యవహారిక భాష
4. మాండలిక భాష
5. ప్రామాణిక భాష

- రాష్ట్రంలో అధికార భాషగా, బోధనా మాధ్యమంగా తెలుగుకు పట్టంకట్టారు. ప్రజల దైనందిన కార్యకలాపాల్లో తెలుగుకు అగ్రస్థానం ఉంది. మన ప్రధాన తెలుగు భాషలో కనిపించే అంతర రూపాలను భాషా రూపాలుగా పేర్కొంటారు.

## గ్రాంథిక భాష

- గ్రంథస్థమైన భాష కాబట్టి గ్రాంథికం అని పిలుస్తారు.
- ప్రాచీన కావ్యభాష సంప్రదాయాన్ని గ్రాంథిక భాష అని పండితులు పేర్కొన్నారు.
- గ్రాంథిక భాష అనగా గ్రంథ రచనకు ఉపయోగపడే భాష అని అర్థం.
- నన్నయ నుంచి పరవస్తు చిన్నయ సూరి వరకు కావ్యాల్లో నిక్షిప్తమైన భాష కాబట్టి దీన్నే కావ్యభాష, సాహిత్య భాష అని కూడా వ్యవహరిస్తున్నారు.
- దీర్ఘ సమాసాలు, క్లిష్ట అన్వయాలు, ప్రౌఢమైన కావ్యశైలి, రీతులు, శయ్యలు, పాకాలు తదితరాలతో వెలువడే కావ్యాల్లోని భాషను గ్రాంథికం అంటున్నారు.
- గ్రాంథిక భాషను సమర్థించే వారిని గ్రాంథిక భాషావాదులని పిలుస్తారు.
- గ్రాంథిక భాషావాదానికి నాయకత్వం వహించిన వారు జయంతి రామయ్య పంతులు.
- గ్రాంథిక భాషావాదుల్లో వేదం వెంకటరాయ శాస్త్రి, చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి ముఖ్యులు.
- గ్రాంథిక భాషా పరిరక్షణ కోసం 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు'ను జయంతి రామయ్య పంతులు స్థాపించారు.
- గ్రాంథిక భాషావాదాన్ని వ్యతిరేకించిన వారిలో ముఖ్యులు గిడుగు, గురజాడ.
- గిడుగు, గురజాడ అవిరళ కృషి వల్ల మన పాఠ్యగ్రంథాల్లో గ్రాంథిక భాషకు ప్రాధాన్యం తగ్గి శిష్ట వ్యవహారికం అమల్లోకి వచ్చింది.

## వ్యవహారిక భాష

**నిర్వచనం:** వాక్ వ్యవహారంలో ఉండి కావ్యాల్లో, లేఖన రూపంలో లేని భాషా రూపాల్ని వ్యవహారికం అంటారు. ప్రస్తుతం వాక్ వ్యవహార, లిఖిత వ్యవహారాలు రెండూ కలిగిన భాషా రూపమే వ్యవహారికి భాష.

- సామాన్య జన వ్యవహారంలో ఉన్న భాషా విశేషాన్ని వ్యవహారికం అనొచ్చు.
- గ్రామ్యభాషా రూపమే వ్యవహారిక భాషగా పరిణతి చెందింది.
- వ్యవహారిక భాషనే గ్రామ్యభాష, జానపద భాష, జనజీవద్భాష అని వ్యవహరిస్తారు.

- గ్రాంథిక భాషను తిరస్కరిస్తూ వ్యవహారిక భాషా ఉద్యమాన్ని లేవనెత్తిన వారు గిడుగు వెంకట రామమూర్తి పంతులు. వ్యవహారిక భాషా ఉద్యమం 1910లో ప్రారంభమైంది.
- వ్యవహారిక భాషా ఉద్యమానికి విశేషంగా కృషిచేసిన వారు గిడుగు రామమూర్తి పంతులు, గురజాడ అప్పారావు, పి.టి.శ్రీనివాస అయ్యంగార్, డబ్ల్యూ.ఎ.యేట్స్.
- గిడుగు రామమూర్తి 1910లో విశాఖపట్నంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో వ్యవహారిక భాష వల్ల విద్యా భ్యాసం సౌలభ్యాన్ని చెప్పి ప్రజల ఆలోచనా ధోరణిలో మార్పు తెచ్చాడు. గిడుగును వ్యవహారిక భాషోద్యమ పితా మహుడు అని పిలుస్తారు. 'స్వభాష స్వగృహం వంటిది' అని గిడుగు రామమూర్తి పేర్కొన్నారు.
- గిడుగు వ్యవహారిక భాషోద్యమ బాటకు జీవం పోసిన వారు గురజాడ అప్పారావు.
- గిడుగు 'సవర' అనే గిరిజన భాషపై అవిరళ కృషి చేసి దానికి లిపిని, వ్యాకరణాన్ని సృష్టించి చక్కని స్థానం కల్పిం చారు.
- మద్రాసు విశ్వవిద్యాలయం వారు 1911లో వ్యవహారిక భాషావాద సంఘాన్ని నియమించారు. ఇది అందరి అభి ప్రాయాల మేరకు సరళ గ్రాంథికానికి అనుకూలంగా తీర్మానం చేసింది.
- గిడుగు వ్యవహారిక భాషోద్యమాన్ని వ్యతిరేకించిన వారిలో ముఖ్యుడు వేదం వెంకటరాయ శాస్త్రి.
- వ్యవహారిక భాషోద్యమం వల్ల వచ్చిన ముప్పు నుంచి తమ ఉనికిని కాపాడుకునేందుకు గ్రాంథిక భాషావాదులు 'సరళ గ్రాంథికం' పేరుతో రచనలు చేసేందుకు ముందుకొచ్చారు.
- 1895లో వేదం వెంకటరాయ శాస్త్రి నీచ పాత్రలకు తొలిసారిగా తన 'నాగానందం' నాటకంలో వ్యవహారిక భాషను ప్రయోగించారు.
- వేదం వెంకటరాయ శాస్త్రి పాత్రోచిత భాష అనే పేరుతో ఆధునిక భాషకు స్థానం కల్పించారు.
- తెలుగులో సమగ్రంగా వ్యవహారిక భాషలో వెలువడిన తొలి నాటకం- కన్యాశుల్కం
- తాపీ ధర్మారావు మొట్టమొదటిసారిగా తన 'జనవాణి' పత్రికలో వ్యవహారిక భాషను ప్రవేశపెట్టారు.
- కందుకూరి వీరేశలింగం తన రచనలను సరళ గ్రాంథికంలో రాయడానికి ముందుకొచ్చారు.
- 20వ శతాబ్ద కాలంలో గ్రాంథిక, వ్యవహారిక భాషోద్యమాల వల్ల తెలుగు భాషకు చాలా మేలు జరిగిందని చెప్పొచ్చు. వీటి వల్ల ఆంధ్ర దేశంలో సాహిత్యపరంగా, పాఠ్యగ్రంథాల పరంగా వ్యవహారిక భాష అమలైంది.

## మాండలికం

### మాండలికం-అర్థ వివరణ:

- మాండలికాన్ని ఇంగ్లిష్‌లో Dialectఅని వ్యవహరిస్తారు.
- Dialect అనే పదానికి నిఘంటువుల్లో కనిపించే అర్థాలు.. సంభాషణం, మాట్లాడేతీరు, వైఖరి, రీతి.
- మాండలిక భాషనే ఉపభాష లేదా ప్రాదేశిక భాష అని కూడా పిలుస్తారు.
- మాండలిక భాష అనగా ఒక మాండలానికి లేదా ఒక ప్రాంతానికి సంబంధించిన భాష అని అర్థం.

### మాండలిక భాష- నిర్వచనాలు:

- మండలంలోని ప్రజలు మాట్లాడే భాష మాండలిక భాష- ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తం.
- ప్రతి వ్యక్తి మాట్లాడేది మాండలికమే కానీ భాష కాదు.
  మాండలికాల సమాహార రూపమే భాష-మాక్స్ ముల్లర్

- మాండలిక భాష వృత్తినిబట్టిగానీ, కులాన్నిబట్టిగానీ ఏర్పడుతుంది- మోనియల్ విలియమ్స్
- పదజాలంలో గానీ, ఉచ్చారణలోగానీ కొంత వైవిధ్యం ఉన్న ఒక మండలానికి సంబంధించిన భాష మాండలికం.

**ముఖ్యాంశాలు:**

- ఒక నిర్ణీత ప్రదేశంలో లేదా ప్రాంతంలో నివసించే ప్రజలు వ్యవహరించే భాషా విశేషాన్ని మాండలికం అనొచ్చు.
- ఒక నిర్దిష్ట ప్రాంతానికి సంబంధించిన ప్రజలు వ్యవహరించే భాషను మాండలికం అంటారు.
- ఒక పరిమిత ప్రాంతంలోని ప్రజలు తమ నిత్య వ్యవహారంలో వినియోగించే భాషను ఆ ప్రాంతానికి సంబంధించిన మాండలిక భాష అనొచ్చు.
- ప్రధాన భాషలోనే ఉంటూ తనదైన ప్రత్యేకతలు ఉన్న భాషే మాండలిక భాష.
- తెలుగు ప్రజలు నిత్య వ్యవహారాల్లో ఎక్కువగా ఉపయోగించేది మాండలికమే.
- ఆంగ్లేయులకు మాండలికంపై పట్టింపులేదు. జర్మన్‌లకు మాండలికంపై మక్కువ ఎక్కువ.
- ప్రముఖ భాషావేత్త సర్‌జార్జ్ గ్రియర్సన్ తన 'లింగ్విస్టిక్ సర్వే' గ్రంథంలో తెలుగు మాండలికాలపై చక్కని పరిశోధన చేశారు.

ఉదా:

1. చాందా జిల్లాలో అత్యధిక సంఖ్యలో తెలుగు ప్రజలు నివసిస్తున్నారని, అక్కడి తెలుగువారిని కోమట్లు అంటారని, వారు మాట్లాడే భాషను దాసిరి, బెడారి అని పిలుస్తారని చెప్పారు.
2. ముంబై నగరంలో నివసించే ప్రవాసాంధ్రులను కామాటీలు అంటారని, వారు మాట్లాడే భాషను, మాండలికాన్ని కామ్య, వడరిగా వ్యవహరిస్తారని గ్రియర్సన్ తెలిపారు.

- సజీవమైన భాషకు మార్పు సహజం. ఈ మార్పులు బహురూపత, వైవిధ్యాల వల్ల ఏర్పడతాయి. బహురూపత వల్ల భాషలో ఏర్పడే మార్పులు మూడు విధాలు.. చారిత్రకం, ప్రాంతీయం, సాంఘికం.
- ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి వృత్తి పదకోశాలను బట్టి తెలుగు ప్రాంతాన్ని నాలుగు భాషా మండలాలుగా విభజించారు. అవి..
- మధ్య మండల ప్రజలు మాట్లాడే భాషను భాషావేత్తలు ప్రామాణికంగా తీసుకున్నారు.
- వేర్వేరు మాండలికాల్లో ఒక వస్తువులు లేదా ఒక పనిని వేర్వేరుగా పిలుస్తారు.

ఉదా: 1. నెల్లూరులో గేదెలు అంటే గుంటూరులో బర్రెలు అంటారు. వీటినే రాయలసీమలో ఎనుములు, ఎనపగొడ్లు అంటారు. శ్రీకాకుళంలో సొమ్ములు అంటారు.

- తెలంగాణ ప్రాంతంలో తండ్రిని బాపూ అంటే కోస్తాలో అయ్యా, కళింగ ప్రాంతంలో బాప్ప అని పిలుస్తారు.
- పూర్వ, మధ్య మండలాల్లో గోంగూర అంటే రాయలసీమలో గోగాకు అని, తెలంగాణలో పుంటికూర అని పిలుస్తారు.

**ప్రామాణిక భాష:**

- సమాజంలో అధిక మంది ఆమోదం పొంది, వ్యవహారంలో ఉన్న భాషా రూపాన్ని ప్రామాణిక భాష అంటారు.
- ప్రచార మాధ్యమిక సాధనాల్లో ఉపయోగించే భాష కాబట్టి ప్రామాణిక భాష అనే పేరువచ్చింది.
- ప్రామాణిక భాషనే శిష్ట వ్యవహారికం అని కూడా పిలుస్తారు. ఇది సరళ గ్రాంథికానికి దగ్గరగా ఉంటుంది.
- భావ సమైక్యతకు, భాషా సమైక్యతకు, జాతి సమైక్యతకు ఎక్కువగా ఉపయోగపడే భాష ప్రామాణిక భాష.
- ప్రామాణిక భాష మార్పుల్ని ఆహ్వానిస్తూ, వాటిని తనలో అంతర్భాగం చేసుకుంటూ స్థిరంగా ఉంటుంది అని పాల్

గార్విన్ అభిప్రాయం.

- ప్రామాణిక భాష, దాని ప్రాధాన్యం గురించి బ్లూమ్ ఫీల్డ్ చక్కగా వివరించారు.
- మన దేశంలో 6 నుంచి 14 ఏళ్ల లోపు బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టినప్పటి నుంచి ప్రామాణిక భాషకు ప్రాధాన్యమిచ్చారు.

| భాషా మండలం | వ్యవహార ప్రాంతాలు/జిల్లాలు |
|---|---|
| పూర్వ మండలం | విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ |
| దక్షిణ మండలం | రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం |
| ఉత్తర మండలం | తెలంగాణ జిల్లాలు |
| మధ్య మండలం | కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలు |

## గత డీఎస్సీ ప్రశ్నలు

**1. లింగ్విస్టిక్ సర్వేలో తెలుగు మాండలికాలను గురించి సవివరంగా తెలియజేసిన భాషా శాస్త్రవేత్త?**

ఎ) హెన్రీ వెండ్ బి) సర్ సి.పి.బ్రౌన్ సి) గ్రియర్సన్ డి) గిడుగు రామ్మూర్తి పంతులు

సమాధానం: సి

**2. ఉండుద్ది, వచ్చుద్ది తదితర క్రియా పదాలు వాడుకలో ఉన్న జిల్లా?**

ఎ) తూర్పుగోదావరి బి) పశ్చిమ గోదావరి సి) కృష్ణా డి) గుంటూరు

సమాధానం: డి

**3. వ్యవహారంలో 'ఉణ్యాది' అనే క్రియారూపం కనిపించే జిల్లా?**

ఎ) శ్రీకాకుళం బి) నెల్లూరు సి) ఆదిలాబాద్ డి) తూర్పుగోదావరి

సమాధానం: బి

**4. మాటకు రాతకు సన్నిహితంగా ఉండి వక్త భావాన్ని శ్రోత తేలిగ్గా గ్రహించేందుకు వీలుపడే భాషా విశేషాన్ని ఏమని పిలుస్తారు?**

ఎ) వ్యవహారిక భాష బి) గ్రాంథిక భాష సి) సరళ గ్రాంథిక భాష డి) మాండలిక భాష

సమాధానం: ఎ

## నమూనా ప్రశ్నలు

**1. Dialect అనగా?**

ఎ) వ్యవహారికం బి) మాండలికం సి) గ్రాంథికం డి) శిష్టవ్యవహారికం

**2. సి.పి. బ్రౌన్ ఏ ప్రాంతంలోని ప్రజలు మాట్లాడే భాషను ఆధునిక ప్రామాణిక భాషగా పేర్కొన్నారు?**

ఎ) పూర్వ మండలం బి) దక్షిణ మండలం సి) ఉత్తర మండలం డి) మధ్య మండలం

**3. 'ప్రతి వ్యక్తి మాట్లాడేది మాండలికమే గానీ భాష కాదు. మాండలికాల సమాహార రూపమే భాష' అని ఎవరన్నారు?**

ఎ) గిడుగు రామమూర్తి బి) మాక్స్ ముల్లర్ సి) సర్‌జార్జ్ గ్రియర్సన్ డి) సి.పి.బ్రౌన్

www.sakshieducation.com

4. వ్యవహారిక భాషావాదాన్ని సమర్థిస్తూ 'గ్రామ్యవాద విమర్శనం' అనే రచన చేసినవారు?

ఎ) పానుగంటి లక్ష్మీనరసింహం
బి) మల్లాది సూర్యనారాయణ శాస్త్రి
సి) పురాణపండ మల్లయశాస్త్రి
డి) చిలకమర్తి లక్ష్మీనరసింహం

5. జయంతి రామయ్య పంతులు గ్రాంథిక భాషా పరిరక్షణ కోసం స్థాపించిన సంస్థ?

ఎ) ఆంధ్ర సారస్వత పరిషత్తు
బి) ఆంధ్ర సాహిత్య పరిషత్తు
సి) తెలుగు అకాడమీ
డి) ఆంధ్ర భాషా వినోదిని

6. శిష్ట వ్యవహారికం అంటే?

ఎ) గ్రాంథికం
బి) వ్యవహారికం
సి) మాండలికం
డి) ప్రామాణికం

7. వేదం వెంకటరాయశాస్త్రి రచించిన ఏ తెలుగు నాటకంలో తొలిసారిగా నీచ పాత్రలకు వ్యవహారిక భాషను ఉపయోగించారు?

ఎ) నాగానందం
బి) కృష్ణతులాభారం
సి) ప్రతాప రుద్రీయం
డి) విషాద సారంగధర

8. ప్రామాణిక భాష మార్పుల్ని ఆహ్వానిస్తూ, ఆ మార్పుల్ని అంతర్భాగం చేసుకుంటూ స్థిరంగా ఉంటుంది- అని ఎవరన్నారు?

ఎ) మాక్స్ ముల్లర్
బి) బ్లూమ్ ఫీల్డ్
సి) పాల్ గార్విన్
డి) సి.పి.బ్రౌన్

## సమాధానాలు:

1) బి 2) డి 3) బి 4) ఎ 5) బి 6) డి 7) ఎ 8) సి

www.sakshieducation.com